సాక్షి
పార్వతీపురం మన్యం

గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



వృద్ధురాలి హత్య

మండల పరిధి కొండదాకరాపల్లి గ్రామానికి చెందిన 62 ఏళ్ల వృద్ధురాలు గంట చిన్నమ్మి బుధవారం హత్యకు గురైంది.

- 8లో



బాల్య వివాహాలు అరికట్టాలి

జిల్లాలో బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు.

- 8లో

ప్రశాంతంగా ఒకేషనల్ పరీక్షలు

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా వ్యాప్తంగా బుధవారం జరిగిన ఇంటర్ ఒకేషనల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొదటి సంవత్సరానికి సంబంధించి 2258 మందికిగాను 1944 మంది పరీక్షలకు హాజరయ్యారు. 314 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐఓ ఎం సత్యనారాయణ తెలిపారు. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 1729 మందిగాను 1591 మంది హాజరయ్యారు.

న్యూస్‌రీల్

పనుల నాణ్యతలో రాజీ పడొద్దు

- ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్



కల్లటిలో సీసీరోడ్లు, కాలువ పనులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

గుమ్మలక్ష్మీపురం: గిరిజన గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీపడొద్దని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణుచరణ్ గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీర్లతో అన్నారు. మండలంలోని కల్లటి, కీసరగూడ గ్రామాల్లో చేపట్టిన, చేపడుతున్న సీసీ రోడ్లు, మురుగు నీటి కాలువల పనులను ఆయన బుధవారం పరిశీలించారు. చేపడుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి, సకాలంలో పూర్తి చేసి గిరిజనులకు సౌకర్యాలు సత్వరమే కల్పించేలా అధికారులు, కాంట్రాక్టర్లు చొరవ తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన గుమ్మలక్ష్మీపురం ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్, గ్యాస్ గొడౌను, పెట్రోల్ బంకును సందర్శించి, రికార్డులు, నిల్వలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అటవీ ఫలసాయాల కొనుగోలు తీరుపై జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జీసీఎంఎస్ మేనేజర్ కృష్ణప్రసాదరావు, గొడౌం ఇన్‌చార్జి ఎం.సాంబశివరావు ఉన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

- రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎం.డి లక్ష్మీశా



ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీస్తున్న రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎం.డి లక్ష్మీశా

పార్వతీపురం: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డా.లక్ష్మీశా అన్నారు. పార్వతీపురం మండలంలోని నర్సిపురంలో గల జగనన్న కాలనీలో నిర్మాణంలో వున్న ఇళ్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రారంభం కాని నిర్మాణాలు ప్రారంభించాలన్నారు. వివిధ దశలలో వున్న నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. పరిశీలనలో గృహ నిర్మాణ సంస్థ పీడీ పి.రఘురాం, డీఈ ప్రసాద్ తదితరులున్నారు.

గిరిజన యువకుల ప్రతిభ



గిరిజన యువకులతో కోచ్

గుమ్మలక్ష్మీపురం: హర్యానా రాష్ట్రం కురుక్షేత్రలో జరిగిన ఆల్ ఇండియా నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన గిరిజన యువకులు ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనపర్చిన పువ్వల దొరబాబు, ఎ.భుజంగరావు, కె.మోహన్‌రావు అనే గిరిజన యువకులు ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు హర్యానాలో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ 35 విభాగంలో పాల్గొన్నారు. ఈ మేరకు దొరబాబు హై జంప్‌లో గోల్డ్ మెడల్, భుజంగరావు 1500 మీటర్ల పరుగు పందెంలో బ్రాంజ్ మెడల్, మోహన్‌రావు హేమర్ త్రోలో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు కోచ్ రామచంద్రరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

విజయనగరం ఫూల్‌బాగ్: గనుల తవ్వకాల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని మైన్స్ ఏడీ ఎస్‌పికె.మల్లేశ్వరరావు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. లక్ష్యానికి మించి ఆదాయం వచ్చిందన్నారు.

రహదారిపై మృత్యుఘోష

వారంతా గిరిజనులే... తమ కుటుంబంలో ఒకరి వివాహ నిశ్చితార్థం కోసం సందడిగా బయలుదేరారు. నిశ్చితార్థ కార్యక్రమం కూడా పూర్తయింది. ఆ సంతోషంలో ఎవరి ఇళ్లకు వారు సరదాగా కబుర్లు చెప్పుకుంటూ వెళ్లిన ఆటోలోనే తిరుగు ప్రయాణమయ్యారు. ఇంతలోనే విధికి వారిపై కన్నుకుట్టింది. ఆటోలో సరదాగా తిరిగి వస్తున్న వారిపైకి ఓ మలుపు వద్ద మృత్యువు రూపంలో లారీ దూసుకొచ్చింది. అంతే క్షణాల్లో ఘోర ప్రమాదం జరిగిపోయింది. ప్రమాద స్థలంలోనే నలుగురు మహిళలు దుర్మరణం చెందారు. మరో వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనతో ఆ ప్రాంతమంతా రోదనలతో నిండిపోయింది.

- చోళ్లపదం శివాలయం మలుపు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- లారీ ఢీకొని ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురి మృతి
- అంటివలస గ్రామంలో విషాదం
- కన్నీరుమున్నీరవుతున్న గ్రామస్తులు



ఘటనా స్థలంలో చెల్లా చెదురుగా మృతదేహాలు



సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



ఊయక నరసమ్మ(ఫైల్) మెల్లిక అమ్మడమ్మ(ఫైల్) మెల్లిక శారధ(ఫైల్) ఊయక లక్ష్మి(ఫైల్) ఊయక వెంకటి(ఫైల్)

కొమరాడ/పార్వతీపురం:

వివాహ నిశ్చితార్థం కోసం ఆటోలో వెళ్లి తిరిగి వస్తున్న వారిలో ఐదుగురు గిరిజనులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం చోళ్లపదం శివాలయం మలుపు వద్ద ఆటోను లారీ బుధవారం ఢీకొన్న ప్రమాదంలో ప్రమాద స్థలంలోనే నలుగురు మృత్యువాత పడగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. దీనికి సంబంధించి కొమరాడ ఎస్ఐ జగదీష్‌నాయుడు తెలిపిన వివరాలు.. కొమరాడ మండలం అంటివలస గ్రామానికి చెందిన ఊయక లక్ష్మి కుమార్తె నిశ్చితార్థం కోసం ఊయక నరసమ్మ, ఊయక లక్ష్మి, మెల్లిక శారద, మెల్లిక అమ్మడమ్మ, ఊయక వెంకటిలతో పాటు మరో 9మంది ఆటోలో వివాహ నిశ్చితార్థం నిమిత్తం అదే మండలంలోని తుమ్మలవలస ఆటోలో వెళ్లారు. అక్కడ నిశ్చితార్థ కార్యక్రమం సందడిగా జరిగింది. అనంతరం స్వగ్రామం అంటివలస తిరిగి అదే ఆటోలో వస్తుండగా మార్గమధ్యంలో చోళ్లపదం శివాలయం మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఆటోను ఢీకొట్టడంతో పెను ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో అంటివలస గ్రామానికి చెందిన ఊయక నరసమ్మ (54), ఊయక లక్ష్మి (48), మెల్లిక శారద(35), మెల్లిక అమ్మడమ్మ (40) అక్కడికక్కడే మృతి చెందారు. ఊయక వెంకటి(55) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తక్షణమే స్పందించిన గ్రామస్తులు 108 వాహనం ద్వారా క్షతగాత్రులను పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే వీరిలో ఊయక రామస్వామి, ఊయక వెంకటేష్‌ల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ప్రమాద విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, అదనపు ఎస్పీ ఓ.దిలీప్‌కిరణ్ ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

అంటివలసలో విషాదం

రెక్కాడితేగాని డొక్కాడని ఆ గిరిజన కుటుంబాలలో ఈ ప్రమాదంతో తీవ్ర విషాదం నెలకొంది. శుభకార్యం కోసం వెళితే మృత్యువు రూపంలో లారీ గిరిజనుల ప్రాణాలను బలికొంది. అందరితో కలివిడిగా ఉండే ఆ గిరిజనులు రహదారి ప్రమాదంలో విగత జీవులుగా మారడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ప్రమాదంలో మృతులంతా ఆయా ఇళ్ల పెద్ద దిక్కు కావడంతో కుటుంబాలు అనాథలుగా మారాయి.

అంతా కూలీలే...

ప్రమాదంలో మృతి చెందిన గిరిజన మహిళలతో పాటు వెంకటి ఏ రోజు కూలి పనులు ఆ రోజు చేసుకుంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నవారే.. ఇప్పుడు ఆ కుటుంబాలకు జీవనాధారం పోయింది. ఈ పరిస్థితుల్లో మిగిలిన కుటుంబ సభ్యులు తమ జీవనమెలా అంటూ రోదిస్తున్నారు. కుటుంబాలకు పెద్ద దిక్కుగా ఉండే తమ వారు ఇలా మృత్యువాత పడడం కలచివేసింది.

అమ్మ రాక కోసం..



అమ్మకోసం ఎదురు చూస్తున్న చిన్నారులు

శుభకార్యానికి వెళ్లిన అమ్మ మెల్లిక శారద రాక కోసం అభం శుభం తెలియని చిన్నారులు ఎదురు చూస్తున్నారు. ఒకవైపు తండ్రి అంధుడు కావడంతో పాటు తల్లి అకాల మరణం చెందడంతో ఆ పిల్లలు అనాథలుగా మారారు. ఆ పిల్లలను చూసి గ్రామస్తులు తల్లడిల్లుతున్నారు. తల్లి మృత్యువాత పడిందన్న విషయం తెలియని ఆ చిన్నారులు తల్లి కోసం దీనంగా చూస్తున్న పరిస్థితి అందరినీ కంటతడి పెట్టించింది.

పరామర్శించిన ఎమ్మెల్యే



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

రహదారి ప్రమాదంలో క్షతగాత్రులను కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి జిల్లా ఆస్పత్రికి చేరుకొని పరామర్శించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యాన్ని అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



అంటివలసలో విషాదం

సుస్థిర అభివృద్ధికి పాటుపడాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా కార్యదర్శి విజయ్‌కుమార్

- రాష్ట్ర ప్రణాళికా కార్యదర్శి విజయ్‌కుమార్

విజయనగరం అర్బన్: మానవ అభివృద్ధికి సంబంధించిన సుస్థిర అభివృద్ధి సూచీల సాధన కోసం ప్రతి ఒక్కరూ మనసు పెట్టి పని చేయాలని రాష్ట్ర ప్రణాళికా కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. ఏ పని ఎవరి కోసం చేస్తున్నాం.. ఎందుకోసం చేస్తున్నాం... అని ఆత్మావలోకం చేసుకోవాలన్నారు. నిజమైన అభివృద్ధి కోసం పని చేస్తున్న అవకాశం వచ్చినందుకు అదృష్టంగా భావించి ఇష్టంతో పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. ముందుగా ఎస్‌డీజీ లక్ష్యాలను ఎందుకు పెట్టవలసి వచ్చింది... వాటి ఉద్దేశాలను పూర్తిగా అర్థం చేసుకోవాలన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల అధికారులకు సుస్థిర అభివృద్ధి, స్పందన కార్యక్రమాలపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 17 సుస్థిర అభివృద్ధి సూచీలను ప్రాధాన్యతలుగా తీసుకొని 2030 నాటికి శతశాతం సాధించే దిశగా లక్ష్యాలను నిర్ణయించుకోవడం జరిగిందని అన్నారు. ఇందులో ప్రధానంగా సామాజిక, ఆర్థిక, పర్యావరణ, సీఎస్ అండ్ పార్టనర్‌షిప్ అంశాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఈ సూచీలను సాధించడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వీటికి మ్యాపింగ్ చేయడం జరిగిందని తెలిపారు. నీతి అయోగ్ అమలు చేస్తున్న 115 ఎస్‌డీజీ సూచీలలో జిల్లా స్థాయిలో 61, గ్రామ, వార్డు స్థాయిలో 47 ప్రభుత్వ పథకాలను మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు. జాతి నిర్మాణంలో ఉద్యోగుల పాత్ర కీలకమని, మనసు పెట్టి పని చేస్తే సంతృప్తి మిగులుతుందని హితవు పలికారు.

సచివాలయ సేవలపై అర్జీలు ఎందుకు వస్తున్నాయి..?

రెవెన్యూ, హౌసింగ్, సచివాలయ సేవలు, సిబ్బంది పై అర్జీలు ఎక్కువగా అందుతున్నాయని వాటికి కారణాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అందిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించినందుకు రెండు జిల్లాల కలెక్టర్లను, అధికారులను సెక్రటరీ అభినందించారు. మొదటి దశలోనే అర్జీని ట్రాక్ చేయడానికి ఆర్థికపరమైన, కోర్టులో ఉన్న అంశాలను గుర్తించేలా ఫార్మటు చేయడం జరిగిందన్నారు. రీ ఓపెన్ కేసులను తగ్గించడానికి ఈ నూతన విధానం ఉపకరిస్తుందన్నారు. స్పందన విచారణాధికారికి అప్‌లోడ్ చేసేటప్పుడు అర్జీదారు అడిగిన సమాధానాన్ని మాత్రమే అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో 13 శాతం రీ ఓపెన్ అర్జీలున్నాయని 42 శాతం అర్జీదారులు సంతృప్తిగా ఉన్నారని ఆయన తెలిపారు.

జగనన్న కాలనీలలో ఇన్‌ఫ్రా అభివృద్ధి

తొలుత కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ హౌసింగ్ కాలనీలలో మౌలిక వసతుల కల్పనలో జిల్లా ముందుందని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో ఎస్‌డీజీ సూచీలలో మాతా, శిశు మరణాలను తగ్గించగలిగామని తెలిపారు. అయితే రక్త హీనత ఉందని, తగ్గించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా జేసీ ఎ.ఆనంద్, విజయనగరం జేసీ మయూర్ అశోక్, రెండు జిల్లాల డీఆర్‌ఓలు గణపతిరావు, వెంకటరావు, ఆర్‌డీఓలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఒక్క రోజే 12 నామినేషన్లు దాఖలు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు బుధవారం 12 మంది జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు తమ నామినేషన్ పత్రా లు అందజేశారు. వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్, టీడీపీ మద్దతు అభ్యర్థిగా వేపాడ చిరంజీవిరావు, బీజేపీ మద్దతు అభ్యర్థిగా పి.వి.ఎన్.మాధవ్ నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ రెబల్ అభ్యర్థిగా ఈర్లె శ్రీరామమూర్తి దిగారు. స్వతంత్ర అభ్యర్థులుగా విజయనగరం జిల్లా రాజాంకి చెందిన పురిపండ శ్రీనివాసరావు, విశాఖ జిల్లా సీబీఎం కాంపౌండ్‌కు చెందిన గుండుపల్లి సతీష్, వేపగుంటకు చెందిన దండేల ఆనందరావు, ఆరిలోవకు చెందిన బలివాడ రామ సంతోష్, మధురవాడకు చెందిన జి.విజయకుమార్, అనకాపల్లి జిల్లా గవరపాలెంకి చెందిన ఆడారి శరత్ చంద్ర, శ్రీకాకుళం జిల్లా సోంపేటకు చెందిన కాళ్ల లోకనాథం, మెళియాపుట్టికి చెందిన రాజాన మోహన్‌రావు నామినేషన్లు దాఖలు చేశారు.



వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఉప ముఖ్యమంత్రులు బూడి ముత్యాలనాయుడు, పి.రాజన్నదొర, మంత్రి బొత్స సత్యనారాయణ

పనుల జోరు

పార్వతీపురం మన్యం జిల్లాలో వాటర్ షెడ్ పనులు ఊపందుకున్నాయి. ఎంపిక చేసిన గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిధులతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.



ప్రారంభించిన వాటర్‌షెడ్ పనులు

- జిల్లాలో వాటర్‌షెడ్ పనులు ప్రారంభం
- చురుగ్గా ఈపీఏ, ఎన్ఆర్ఎం నిర్మాణం
- ఏడు మైక్రో.. ఒక మేజర్ వాటర్‌షెడ్ల పనులు
- బడ్జెట్ రూ.10.61 కోట్లు

పార్వతీపురం టౌన్:

జిల్లాలో వాటర్ షెడ్ పనులు జోరందుకున్నాయి. ప్రధానమంత్రి కృషి సంచయీ యోజన (పీఎంకేఎస్‌వై) ద్వారా వాటర్ షెడ్ డెవలప్‌మెంట్ కాంపొనెంట్(డబ్ల్యూడీసీ) పేరుతో వివిధ పనులు జరుగుతున్నాయి. ఈ పనులకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 నిధులు నిధులు సమకూరుస్తున్నాయి. జిల్లాలో ఏడు మైక్రో వాటర్‌షెడ్ పనులు నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుతం కొన్ని మండలాల్లో ప్రాదేశిక కార్యక్రమం(ఎంట్రీ పాయింట్ యాక్టివిటి - ఏపీఏ), సహజ వనరుల అభివృద్ధి(ఎన్ఆర్ఎం - నేచురల్ రిసోర్స్ మేనేజ్‌మెంట్) ద్వారా పనులు జరుగుతున్నాయి. మొత్తం బడ్జెట్ ఐదేళ్ల కాలంలో (2020 - 21, 2025 - 26 వరకు) ఈ పనులు నిర్వహించాల్సి ఉంది. ఇందులో ఈపీఏ ఎన్ఆర్ఎం, జీవనోపాధుల పెంపుదల తదితర పనులు ఈ ఐదేళ్ల కాలంలో చేసేందుకు రూ.10.61 కోట్లను ఖర్చు చేయాల్సి ఉంది.

జిల్లాలోని తొమ్మిది పంచాయతీల్లో పనులు

మైక్రో వాటర్‌షెడ్ కింద పనులు చేసేందుకు జిల్లాలోని 7 పంచాయతీలను ఎంపిక చేశారు. కొండవాడ, తాడికొండ, లాబేసు, గుమ్మలక్ష్మీపురం, లక్కగూడ, పి ఆమిటి, ఉల్విన్‌పేట, ఇరిడి, రెల్ల, పెదకెర్జిల గ్రామాల్లో పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. మేజర్ వాటర్‌షెడ్ కింద గుమ్మలక్ష్మీపురం పంచాయతీలో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి.

ఇదీ లక్ష్యం

- నేల, నీరు వృక్ష సంపదలను సక్రమంగా వినియోగించడం.
- తమ సమస్యలు తాము తీర్చుకోవడంలో ప్రజల సామర్థ్యాన్ని పెంపొందించడం.
- పేదల వ్యక్తిగత భూములు, పశువులు, పండ్ల తోటలు, చేపల పెంపకం వంటి వాటిలో ఉత్పాదకత పెంపొందించడం.
- పేదల ప్రస్తుత జీవనోపాధులను మెరుగుపర్చుకోవడం, కొత్త జీవనోపాధి అవకాశాలు కల్పించి వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను పెంచడం.
- పనులు, ఆస్తుల నిర్వాహణ, మరమ్మతులకు ప్రజలే పూర్తి బాధ్యత వహించేలా ప్రోత్సహించటం.

ప్రాదేశిక కార్యక్రమం

ప్రాదేశిక కార్యక్రమం (ఎంట్రీ పాయింట్ యాక్టివిటి - ఈపీఏ) ద్వారా ఆయా గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులను వాటర్‌షెడ్ ద్వారా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో సిమెంటు బెంచీలు (సచివాలయాలు, దేవాలయాలు), ఆటోస్టాండ్లు, పశువులకు నీటి తొట్లు, పశు వైద్య శిబిరాలు, పైపులైన్లు, విద్యార్థులకు డైనింగ్ హాల్స్, సోలార్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకుగాను 12 పనులకు రూ.13.49 లక్షలు అనుమతులు వచ్చాయి. ఇందులో 90శాతం పనులు జరిగాయి.

సహజ వనరుల అభివృద్ధి

సహజ వనరుల అభివృద్ధి (నేచురల్ రీసోర్స్ మేనేజ్‌మెంటు - ఎన్ఆర్ఎం) కింద వివిధ అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నారు. కందకాలు, కండిత కందకాలు, రాతి కట్టడాలు, చెక్ డ్యాములు, పెర్క్యులేషన్ ట్యాంకులు, చెక్ వాల్వ్‌లు, రైతులకు పంట నూర్పిడి కల్లాలు తదితర అభివృద్ధి పనులను చేస్తున్నారు. ఈ పథకానికి సంబంధించి 2022 - 23 ఆర్థిక సంవత్సరానికి 94 పనులకుగాను రూ. 1.60 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంది. ప్రస్తుతం పనులన్ని ప్రగతిలో ఉన్నాయి.



పనులు పరిశీలిస్తున్న అధికారులు

జిల్లాలోని వివరాలు ఇలా...	
ఎంపికైన పంచాయతీలు	: 7
వాటర్‌షెడ్ పనులు	: 1
మైక్రో వాటర్‌షెడ్ పనులు	: 7
ఐదేళ్లకు మొత్తం బడ్జెట్	: రూ. 10.21 కోట్లు
కేంద్ర ప్రభుత్వం వాటా	: 60 శాతం
రాష్ట్ర ప్రభుత్వం వాటా	: 40 శాతం

4827 హెక్టార్లలో పనుల నిర్వహణ

ఎంపికైన తొమ్మిది మండలాల్లోని తొమ్మిది గ్రామాల్లో 4827 హెక్టార్లలో వాటర్ షెడ్ పనులు నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుతం వేల హెక్టార్లను గుర్తించారు. ఇందుకుగాను రూ.4.99 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. ప్రస్తుతానికి మొత్తం బడ్జెట్‌కు ప్రణాళికలు రూపొందించారు. పరిపాలన అనుమతులు కూడా వచ్చాయి. అయితే వివిధ రకాల పనులు చేయాల్సి ఉండడంతో ప్రస్తుతం ప్రాదేశిక కార్యక్రమం కింద పనులు సహజ వనరుల అభివృద్ధి కింద జరుగుతున్నాయి.

ఐదేళ్లలో పూర్తి చేస్తాం



వాటర్‌షెడ్ కింద చేయాల్సిన పనులన్నీ ఐదేళ్ల కాలంలో పూర్తి చేస్తాం. ప్రస్తుతం ఎన్ఆర్ఎం, ఈపీఏ కింద పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే రాష్ట్ర అధికార బృందం కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. ఉన్న బడ్జెట్‌లో అన్ని అభివృద్ధి పనులు చేసి ప్రజలకు మేలు జరిగేలా ప్రణాళికలు రూపొందించాం.

– జె.శాంతీశ్వరరావు, అదనపు ప్రాజెక్టు డైరెక్టర్, వాటర షెడ్ల విభాగం

సత్ఫలితాల సాధనకు ప్రత్యేక చర్యలు

- జిల్లా సమన్వయకర్త చంద్రావతి

గరుగుబిల్లి: గురుకుల పాఠశాలల్లో పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలను సాధించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాల జిల్లా సమన్వయకర్త బి.చంద్రావతి అన్నారు. మండల కేంద్రంలోని పాఠశాలను ఆమె బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను, భోజన నిర్వాహణను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో శత శాతం ఉత్తీర్ణతకు కృషి చేయడం జరుగుతుందన్నారు. పబ్లిక్ పరీక్షలకు అవసరమైన మెటీరియల్‌ను విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. పరీక్షలంటే భయాన్ని పాగొట్టేందుకు విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. పరిశీలనలో ప్రిన్సిపాల్ సిహెచ్.శ్రీదేవి, తదితరులున్నారు.



విద్యార్థులతో భోజనం చేస్తున్న జిల్లా సమన్వయకర్త చంద్రావతి

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ పటిష్టానికి కృషి చేయాలి

- పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులకు పిలుపు

విజయనగరం: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ పటిష్టానికి కృషి చేయాలని, వారికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చెప్పినట్లు అనుబంధ విభాగాలు రాష్ట్ర కో ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర రెడ్డి చెప్పారు. కొత్తగా నియమితులైన వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులకు ఆయన అభినందనలు తెలియజేశారు.

విజయనగరం జిల్లాలో అధ్యక్షులుగా నియమితులైన వారి వివరాలు

మహిళా విభాగం : మూకల కస్తూరి(ఎస్.కోట). రైతు విభాగం: జాగరపు చిన సత్యారావు(గజపతినగరం), బీసీ సెల్: మంత్రి అప్పలనాయుడు(గజపతినగరం), ఎస్సీ సెల్: పీరుబండి జైహింద్ కుమార్(గజపతినగరం), ఎస్టీసెల్: కేత వీరన్న(ఎస్.కోట), మైనార్టీ సెల్: అబ్దుల్ హమీద్ షేక్(బొబ్బిలి). వీవర్స్ వింగ్: దోమతం శెట్టి శ్రీనివాస రావు(రాజాం), డాక్టర్స్ వింగ్: బొత్స కాశీనాయుడు(బొబ్బిలి), పంచాయతీ రాజ్ వింగ్: కోట్ల రాము నాయుడు(నెల్లిమర్ల), వాణిజ్య విభాగం: కేదారిశెట్టి శ్రీరామమూర్తి. (విజయనగరం), కల్చరల్ వింగ్: ధవళ సర్వేశ్వర రావు(విజయనగరం), వైఎస్సార్ సేవాదళ్: మారం బాల బ్రహ్మారెడ్డి (విజయనగరం), దివ్యాంగుల విభాగం: దావాడ కొడబాబు(విజయనగరం), పబ్లిసిటీ వింగ్: గుడివాడ రాజేశ్వర రావు(ఎస్.కోట), స్టూడెంట్ వింగ్: కరుమజ్జి సాయి(విజయనగరం)

పార్వతీపురం మన్యం జిల్లాలో..

యూత్ వింగ్: డాక్టర్ రంగుముద్రి శివ నరేంద్ర నాయుడు(పార్వతీపురం), మహిళా విభాగం: రెడ్డి పద్మావతి(సాలూరు), రైతు విభాగం: కోరాడ సూర్యనారాయణ(పాలకొండ), బీసీ సెల్: ఉరిటి రామారావు (కురుపా), ఎస్సీ సెల్: ఎస్.శ్రీనివాస రావు(పార్వతీపురం), ఎస్టీ సెల్: కొండగొర్రి ఉదయ్‌కుమార్(సాలూరు), మైనార్టీ సెల్: హోజీ షేక్ మొహిద్దీన్ బాషా(సాలూరు), గ్రీవెన్స్ సెల్: శెట్టి నాగేశ్వర రావు(కురుపాం), డాక్టర్స్ వింగ్: డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహన రావు(పార్వతీపురం),వర్స్ వింగ్: పిచ్చిక సోమేశ్వర రావు(పార్వతీపురం), వాణిజ్య విభాగం: అందవరపు కోటేశ్వర రావు(కురుపాం), పంచాయతీరాజ్ వింగ్: గుడివాడ సంపత్ కుమార్(కురుపాం), స్టూడెంట్ వింగ్: ఆరిక సుబుద్ధి(కురుపాం), వైఎస్సార్ టీయూసీ: టీవీ రమణ(పార్వతీపురం), పబ్లిసిటి వింగ్:జరజాపు సూర్యనారాయణ(సాలూరు), వైఎస్సార్ సేవాదళ్: సువ్వాడ రామకృష్ణ(సాలూరు), ఐటీ వింగ్: ముషిడిపల్లి కృష్ణారావు(సాలూరు), కల్చరల్ వింగ్: సవర గోపాల్(పాలకొండ), దివ్యాంగుల విభాగం: ముల్లు ప్రసాద్ (పాలకొండ)

పైడితల్లి ఆలయ హుండీల ఆదాయం లెక్కింపు

భోగాపురం: పోలిపల్లిలో కొలువైన పైడితల్లి అమ్మవారికి భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖ ఈఓలు డీవీవీ ప్రసాదరావు, కె. శ్రీరామ్, ఆలయ కమిటీ చైర్మన్ కర్రోతో పైడిరాజు ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. సుమారు 11 నెలల కాలానికి హుండీల ద్వారా 3,39,316 రూపాయల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, మాజీ ఉప సర్పంచ్ పతివాడ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా కంటైనర్ పట్టివేత

దత్తిరాజేరు: మండలంలోని కోరపు కొత్తవలస గ్రామానికి సమీపంలో జాతీయ రహదారి 26 మీదుగా అక్రమంగా పశువులను రవాణా చేస్తున్న కంటైనర్‌ను బుధవారం పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు టి.బూర్జవలస ఎస్సై రాజేష్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పంజాబ్‌కు చెందిన సబీర్ ఈశ్వరన్ 30 పశువులను కంటైనర్‌లో తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించి నిందితులపై కేసు నమోదు చేశారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

- టీనేజ్ గర్భాలను నివారించండి
- కలెక్టర్ ఎ.సూర్యకుమారి
- సఖి, సహేలి గ్రూపుల నిర్వహణపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: జిల్లాలో బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. అవసరమైతే ప్రభుత్వ చట్టాలను వినియోగించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రులతోపాటు, వివాహం చేసే పురోహితులు, పాస్టర్లపైనా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. టీనేజ్ గర్భాలను నివారించాలని, దీని కోసం బాలికలను చైతన్య పరచాలని సూచించారు. సఖి, సహేలి గ్రూపుల నిర్వహణపై, కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం సమావేశం నిర్వహించి మండలాలవారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సఖి, సహేలి సమావేశాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని సూచించారు. బాలికలు కూడా డిగ్రీ వరకు చదువుకునేలా చైతన్య పరచాలని 21 ఏళ్లలోపు వివాహం చేసుకోకుండా చూడాలని కోరారు. చిన్నవయసులోనే గర్భం దాల్చడం ద్వారా ఎదురయ్యే దుష్పరిణామాలను వివరించాలని చెప్పారు. బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతినెలా సఖి సమావేశాలను తప్పనిసరిగా నిర్వహిస్తూ ఆ గ్రూపు సభ్యులతో మమేకం కావడం ద్వారా క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, జరగబోతున్న బాల్య వివాహాలను తెలుసుకునే అవకాశం కలుగుతుందని అభిప్రాయ పడ్డారు.

సమన్వయంతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు

దీని కోసం వివిధ శాఖల సిబ్బందితో గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసినపుడే మెరుగైన ఫలితాలు వస్తాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లాలోని ఆరు మండలాల్లో సుమారు 53 వేల మంది గిరిజనులు ఉన్నారని వారి సమస్యలపై దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. వారందరికీ ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందించేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లాలో 99 శాతం ప్రసవాలు ఆస్పత్రిలోనే జరుగుతున్నాయని, ఇది సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్‌వీరమణకుమారి, ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి, ఎంపీడీఓలు, వైద్యాధికారులు, మహిళా పోలీసులు, యునిసెఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పిల్లల పట్ల అప్రమత్తం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి లక్ష్మీకుమారి

- సివిల్ జడ్జి లక్ష్మీ కుమారి

విజయనగరం లీగల్: పిల్లల పట్ల మనమందరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ కార్యదర్శి, సివిల్ జడ్జి లక్ష్మీ కుమారి హితవు పలికారు. ఈ మేరకు బుధవారం చైల్డ్ వెల్ఫేర్ పోలీసు అధికారుల ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని చైల్డ్ వెల్ఫేర్ పోలీసు అధికారులు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిన దగ్గర నుంచి పెంపకం వరకు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. జువైనల్స్ (18 ఏళ్లలోపు) నేరానికి పాల్పడితే వారిపట్ల ప్రవర్తించాల్సిన విధానం, తీసుకోవాల్సిన పద్ధతులకు వివరించారు.

నేరపరిశోధనలో కచ్చితత్వం ఉండాలి

ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ రమ్య మాట్లాడుతూ జువైనల్‌ను అరెస్టు చేసి జువైనల్ జస్టిస్ బోర్డులో ప్రవేశపెట్టినప్పుడు సివిల్ డ్రెస్‌లో ఉండాలని, వారితో నడుచుకునే విధానాన్ని వివరించారు. జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.రఘురాం మాట్లాడుతూ చట్టంతో విభేదించిన పిల్లల నేర పరిశోధనలో కచ్చితత్వం పాటించాలన్నారు. జిల్లా ప్రొబేషన్ అధికారి ఎం.శరత్‌బాబు మాట్లాడుతూ జువైనల్ పట్ల పోలీసు అధికారులు ప్రవర్తించాల్సిన విధానాన్ని వివరించారు. విజయనగరం గవర్నమెంట్ జనరల్ హాస్పటల్ సైకాలజిస్టు ఎస్.వి.రమణ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో జాగ్రత్త వహించాని, వారిపట్ల ప్రేమపూర్వకంగా మెలగాలని, వారి కోసం ఎక్కువ సమయాన్ని కేటాయించి స్నేహపూర్వకంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలి హత్య

- ఉలిక్కిపడిన కొండ చాకరాపల్లి గ్రామస్తులు
- పోలీసులు, డాగ్‌స్క్వాడ్ పరిశీలన
- బంగారు ఆభరణాలకోసమని కుటుంబసభ్యుల ఫిర్యాదు



పొలంలో చిన్నమ్మి మృతదేహం (ఇన్‌సెట్లో) గంట చిన్నమ్మి (ఫైల్)



ఘటనా స్థలంలో దర్యాప్తు నిర్వహిస్తున్న పోలీసులు

వంగర: మండల పరిధి కొండచాకరాపల్లి గ్రామానికి చెందిన 62 ఏళ్ల వృద్ధురాలు గంట చిన్నమ్మి బుధవారం హత్యకు గురైంది. వృద్ధురాలి దగ్గర బంగారు ఆభరణాలను దోచుకుని దుండగులు మట్టుబెట్టినట్లు రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర వెల్లడించారు. ఆమె కుమార్తె సతిపిడకల పుణ్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు నిర్వహించి ఘటనకు సంబంధించిన వివరాలు తెలిపారు. తన కుమార్తెలు పుణ్యవతి, కళావతిల స్వగ్రామం నీలయ్యవలస వెళ్లిన చిన్నమ్మి అక్కడి నుంచి ఈ నెల 20న కొండ చాకరాపల్లి చేరుకుంది. ఆధార్ అప్‌డేట్ చేసేందుకు వలంటీర్‌ను సంప్రదించింది. అదే రోజు సాయంత్రం నుంచి చినమ్మి ఆచూకీ కనిపించలేదు. బుధవారం గ్రామ సమీపంలోని రావి పొలంలో ఆమె మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో గ్రామస్తులతోపాటు కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని చూసి హతురాలి కుమార్తెలు రోదిస్తూ తమ తల్లి వద్ద ఉన్న బంగారు ఆభరణాలకోసం ఎవరో ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు రాజాం రూరల్ సీఐ ఉపేంద్రతోపాటు ఎస్సై బుడుమూరు లోకేశ్వరరావులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంట పొలం సమీప రైతులు, గ్రామంలోని ఆమె ఇంటి పరిసరాల ప్రజలతో మాట్లాడి సమగ్ర దర్యాప్తు చేపట్టిరు. సమాచారంమేరకు విజయనగరం డాగ్‌స్క్వాడ్ వచ్చి తనిఖీలు నిర్వహించింది. వృద్ధురాలిని హత్య చేసిన ఘటనలో నిందితులకోసం అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతదేహాన్ని రాజాం సీహెచ్‌సీకి తరలించి కేసు నమోదుచేశామని వివరించారు.

గ్రామంలో ఆందోళన

ఇదిలా ఉండగా ప్రశాంతంగా ఉన్న పల్లెలో వృద్ధురాలు చిన్నమ్మి హత్యకు గురైన విషయంలో గ్రామస్తులతోపాటు ఆ నోటా ఈ నోటా తెలుసుకున్న పరిసర గ్రామాల ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఒంటరిగా పొలాలకు, వెళ్లేందుకు, ప్రయాణాలు చేసేందుకు భయాందోళన చెందుతున్నారు. హతురాలు చిన్నమ్మి గ్రామంలో అందరితో కలివిడిగా ఉండేదని, ఎటువంటి శుభాకార్యాలైన ముందుండి అన్ని పనుల్లో సాయం చేసేదని చెబుతున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

విజయనగరం జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం జరిగిన ప్రమాదాల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఆయా ప్రమాద సంఘటనలపై మృతుల కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

బావిలో పడి మహిళ మృతి



బావిలో పడి మృతి చెందిన సామాలమ్మ

మెంటాడ: మండలంలోని పెదమేడపల్లి గ్రామానికి చెందిన ఆదిరెడ్డి సోమాలమ్మ(43) గ్రామంలోని కారిపొలంలో ఉన్ననేల బావిలో పడి సోమవారం సాయంత్రం మృతి చెందింది. స్థానికులు సమాచారం. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్త గజపతినగరం ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై గజపతినగరం సీఐ లెంక అప్పలనాయుడిని సంప్రదించగా మృతి చెందడం వాస్తవమేనని అయితే బంధువుల నుంచి ఎటువంటి ఫిర్యాదు అందకపోవడం వల్ల ఇంతవరకూ కేసు నమోదు చేయలేదన్నారు.

వేటకు వెళ్లి యువకుడు..



సాత్ సముద్రంలో పడి మృతి చెందిన బెవర మసేను

పూసపాటిరేగ: చింతపల్లి పంచాయతీకి చెందిన బెవర మసేను (24) బుధవారం వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీనిపై స్థానిక నాయకుడు బర్రి చిన్నప్పన్న అందించిన వివరాలిలా ఉన్నాయి. చేపల వేటకోసం మంగుళూరు జెట్టీకి మసేను బోటులో వెళ్తడంగా ప్రమాదవశాత్తు సముద్రంలో పడి మృతి చెందాడన్నారు. వల లాగుతుండగా సాత్ సముద్రంలో పడిపోవడంతో ప్రమాదం జరిగినిట్లు చెప్పారు. పోస్టుమార్టం అనంతరం చింతపల్లిలోని స్వగృహానికి మసేను మృతదేహం చేరుకోవచ్చని తెలిపారు.

రైలు నుంచి జారి పడి విద్యార్థి..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న జీఆర్‌పీ ఎస్సై శ్రీనివాసరావు

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి జారి పడి కిమిడి శంకరరావు(16) అనే విద్యార్థి మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్సై చెల్లూరి శ్రీనివాసరావు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం పొందూరు నుంచి విశాఖపట్నం రైలులో ప్రయాణిస్తున్న శంకరరావు చీపురుపల్లి సమీపంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి మృతి చెందినట్లు తెలిపారు. వంగర మండలంలోని తలగాం గ్రామానికి చెందిన శంకరరావు విశాఖపట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. స్థానిక రైల్వే స్టేషన్ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక టీటీడీ కల్యాణ మంటపం సమీపంలో ఉన్న ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య వయసుకలిగిన వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు బుధవారం తెలిపారు. వార్డు ఎంఎస్‌పీ సుధారాణి అందించిన సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి, మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటరావు తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹ 204

కష్టాలకు సెల్‌విచ్చేద్దాం..!

- గిరిజన గ్రామాలకు త్వరలో నెట్‌వర్క్ సిగ్నల్స్
- అందుబాటులోకి రానున్న మొబైల్ సేవలు
- 182 టవర్ల ఏర్పాటుకు చర్యలు



కొండపై సిగ్నల్ ఉన్న చోటకు వచ్చి పింఛన్‌లు ఇస్తున్న గడికారెం గ్రామ వెల్ఫేర్ అసిస్టెంట్ (ఫైల్)

సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లాలో చాలా గ్రామాల్లో కొండలు ఎక్కితే గాని సెల్ సిగ్నల్స్ అందని పరిస్థితి. ఫోన్ చేయాలంటే కిలో మీటర్ల దూరం కాలినడకన వెళ్లాల్సి వస్తుంది. దీంతో అత్యవసర సమయాల్లో సమాచారం అందక వైద్య, ఇతర సేవలు పొందలేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఆన్‌లైన్ సరిగా అవ్వక పథకాల మంజూరులో కూడా అవస్థలు తప్పడం లేదు. ఇక ఈ కష్టాలకు తీరనున్నాయి. జిల్లాలో 182 మొబైల్ టవర్లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. వాటిలో ఎయిర్‌టెల్ 34, జియో 75, బీఎస్ఎన్ఎల్ 73 ఉన్నాయి.

ఇదీ పరిస్థితి...

మారుమూల గిరిజన ప్రాంతాల్లో సుమారు 200కు పైగా గ్రామాలకు కమ్యూనికేషన్ వ్యవస్థ లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో 108కు ఫోన్ చేయాలన్నా అవ్వని పరిస్థితి. అలాగే పింఛన్లు గ్రామవలంటీర్‌లు ఇవ్వాలన్నా సెల్‌సిగ్నల్ ఉన్న ప్రదేశాలకు వచ్చి ఇవ్వాలి. సుదూర ప్రాంతాలకు వెళ్లడం గానీ, కొండలపై కానీ ఎక్కితేనే సిగ్నల్స్ లభిస్తాయి. పథకాలు ఆన్‌లైన్ చేయాలన్నా, ఇప్పుడు కొత్తగా ఫేషియల్ హాజరు వేయాలన్నా ఉద్యోగులకు కూడా అవస్థలు తప్పడం లేదు. గతంలో పలుమార్లు పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లారు. దీంతో దశలవారీగా సెల్ టవర్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. అలాగే కొన్ని చోట్ల పంచాయతీ పరిధిలో టవర్ల ఏర్పాటుకు స్థల సేకరణ ప్రక్రియ పూర్తి కావచ్చింది. ఈ నేపథ్యంలో మరి కొద్ది రోజుల్లో సిగ్నల్ కష్టాలకు తెరపడనుంది.

మండలం	సెల్‌టవర్లు	మండలం	సెల్‌టవర్లు
సీతంపేట	27	పాచిపెంట	18
జియ్యమ్మవలస	7	సాలూరు	21
కొమరాడ	21	మక్కువ	2
గుమ్మలక్ష్మీపురం	52	భామిని	1
కురుపాం	32	పార్వతీపురం	1

సమాచార వ్యవస్థ మెరుగుపడుతుంది



సమాచార వ్యవస్థ మెరుగు పడుతుంది. గతంలో ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకువెళ్లాం. ఆయన వెంటనే స్పందించి కమ్యూనికేషన్ వ్యవస్థ మెరుగుపర్చడానికి అన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. దీనిలో భాగంగానే ఏజెన్సీ గ్రామాల్లో వివిధ కంపెనీల సెల్‌టవర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే

ఇన్నాళ్లకు పరిష్కారం

ఇన్నాళ్లకు సెల్ టవర్‌లు పెట్టడంతో సిగ్నల్ సమస్యలు తీరుతాయి. చాలా ఏళ్లుగా మొబైల్ సిగ్నల్స్ లేక ఇబ్బందులు పడుతున్నాం. గ్రామాల్లో చాలా మంది వద్ద సెల్‌ఫోన్లు ఉన్నా ఉపయోగం లేదు. మైదాన ప్రాంతాలకు వచ్చినప్పుడు మాత్రమే వినియోగిస్తున్నాం.

ఎస్.మోజేషు,లంబగూడ